
తాగునీటి సమస్యకు జల్‌జీవన్‌తో చెక్

- రక్షిత మంచినీటి పథకాలు, పైపులైన్ల నిర్మాణం
- వచ్చే వేసవి నాటికి ఇంటింటికీ కుళాయిలు

కొత్తపేట: కోనసీమలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు దీర్ఘకాలికంగా దాహార్తితో పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల్లో భాగంగా సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంది. ఆ మేరకు ప్రధాన గ్రామాలతో పాటు ఆయా పంచాయతీల పరిధిలోని అన్ని హేబిటేషన్‌లలో ఇంటింటికీ కుళాయితో ప్రజలకు సురక్షిత మంచినీరు సరఫరా చేయాలనే లక్ష్యంతో ఎక్కడికక్కడ మంచినీటి పథకాలు, పైపులైన్లు నిర్మించి వేసవిలో దాహార్తి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో యుద్ధప్రాతిపదికన నిర్మాణం చేపట్టింది. దానిలో భాగంగా కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సుమారు 371 హేబిటేషన్‌లలో జల్‌జీవన్ మిషన్ కింద రక్షిత మంచి నీటి పథకాలు, పైపు లైన్లు మంజూరు చేసింది. వాటి నిర్మాణానికి రూ.133,56 కోట్లు విడుదల చేసింది. వాటిలో 58 పనులు పూర్తి కాగా పలు పథకాలు, పనులు ప్రారంభించారు. సుమారు 100 పనులు దాదాపు పూర్తి కాగా ప్రారంభించాల్సి వుంది. 213 పనులు జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.


గంటిలో నిర్మాణం పూర్తయిన రక్షిత మంచినీటి పథకం


గంటి గ్రామంలో మంచినీటి కుళాయి

కొత్తపేట నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో రావులపాలెం, కొత్తపేట మండలాల్లోని గ్రామాలకు శుద్ధి చేసిన గోదావరి నీటి సరఫరాకు రావులపాలెంలో సుమారు రూ.55 కోట్లతో నిర్మించిన పథకం గత ప్రభుత్వంలో ఆది నుంచీ నత్త నడకన సాగుతూ వచ్చింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కృషితో గోదావరి వాటర్ ప్రాజెక్ట్ స్కీమ్ నిర్మాణం పూర్తయింది. ఆ పథకం అమల్లోకి వచ్చింది. సురక్షిత నీరు సరఫరా అవుతుంది. కాగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని సుమారు 35 గ్రామ పంచాయతీల పరిధిలో రక్షిత మంచినీటి పథకాలు, పైపులైన్లకు సంబంధించిన 95 పనులకు 3 బ్యాచ్‌లుగా రూ.56.13 కోట్లు మంజూరయ్యాయి. మొదటి బ్యాచ్‌లో ఇప్పటికే రూ.2.93 కోట్లతో 15 పనులు పూర్తికాగా రూ.15.30 కోట్లతో 27 పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రూ.1.67 కోట్లతో 4 పనులు ప్రారంభించవలసి ఉంది. రెండో బ్యాచ్‌లో 38 పనులకు రూ.31.60 కోట్లు, మూడో బ్యాచ్‌లో 11 పనులకు రూ.4.67 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభమయ్యాయి.

ఎన్నో ఏళ్ల తాగునీటి సమస్యకు పరిష్కారం



గంటిలో ఎన్నో ఏళ్లగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇన్నేళ్లకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కృషి ఫలితంగా సీఎం జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1.66 కోట్లు మంజూరు చేయగా 90 వేల లీటర్లు, 40 వేల లీటర్లతో పథకాలు, పైపులైన్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లతో పాటు 80 వేల లీటర్ల కెపాసిటీ గల సంపు నిర్మించారు. దాదాపు పైపు లైన్ల నిర్మాణం పూర్తయింది. శుద్ధి చేసిన గోదావరి జలాన్ని ట్యాంకుల్లో, సంపులో నింపి పైపు లైన్ల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తారు. ఈ నిర్మాణాలతో తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది.

– సాగి బంగార్రాజు, సర్పంచ్, గంటి

త్వరితగతిన నిర్మాణాలకు చర్యలు



జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులను ప్రభుత్వ లక్ష్యం మేరకు త్వరితగతిన పూర్తి చేసి రక్షిత మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. నియోజకవర్గంలో ఇప్పటికే 15 పనులు పూర్తి చేశాం. ప్రస్తుతం అనేక గ్రామాల్లో పైపులైన్ల నిర్మాణం జరుగుతుంది. వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ఈ వేసవిలో మంచినీరు సరఫరా చేస్తాం. పలు గ్రామాల్లో ట్యాంకులు, పైపు లైన్లు నిర్మాణం జరుగుతుండగా వాటిలో టెండర్లు పూర్తయిన పథకాలు, పైపులైన్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

– బీవీఎల్ నరసింహారావు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్, కొత్తపేట

ప్రభుత్వ లక్ష్యానికి బ్యాంకర్లు సహకరించాలి

కొత్తపేట: పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాల ద్వారా ఆయా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్న సొమ్మును వారికి చెల్లించాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు సూచించారు. మంగళవారం సాయంత్రం ఎంపీపీ కార్యాలయంలో ఆయన మండలంలో బ్యాంకర్లు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, వైఎస్సార్ క్రాంతిపథం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఎంపీడీఓ మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గ్రామాలకు వెళ్లినప్పుడు ప్రభుత్వం వివిధ పథకాల కింద తమ ఖాతాలకు జమ చేస్తున్న ఆర్థిక లబ్ధిని బ్యాంకుల వారు చెల్లించడం లేదని పలువురు లబ్ధిదారులు వాపోయారన్నారు. లబ్ధిదారులు గతంలో రుణాలు తీసుకుని ఉంటే ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా విడుదల చేసిన సొమ్మును వారి ఇష్టంతో జమ చేసుకోవాలి తప్ప ఇబ్బంది పెట్టడం తగదన్నారు. డ్వాక్రా రుణాలు, వైఎస్సార్ ఆసరా చెల్లింపుల విషయాల్లో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, ఏపీఓ నేతల ఆనంద్‌కుమార్, ఏపీఎం పిల్లి విశ్వనాథం, వివిధ బ్యాంకుల బీఎంలు, ఎఫ్ఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా కొండాలమ్మ జాతర

మామిడికుదురు: పాశర్లపూడిలో కొలువుదీరిన గ్రామదేవత శ్రీకొండాలమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం వైభవంగా జరిపించారు. జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే భారీ విద్యుత్ దీపాలతో ఆలయాన్ని తీర్చిదిద్దారు. జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. ఈ జాతర మహోత్సవాలు సోమవారం వరకు ఏడు రోజులు జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది. ఆలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనతో జాతర ముగుస్తుందన్నారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం

మలికిపురం: మండలంలోని మట్టపర్రులో వేంచేసిన అభయాంజనేయ, షిర్డీ సాయిబాబా ఆలయాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి స్వామినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది.

పళ్లాలమ్మకు లక్ష చామంతి పూజ


ఆలయ ప్రాంగణంలో చామంతి పూజ చేస్తున్న భక్తులు

కొత్తపేట: వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మకి లక్ష చామంతి పూజ వైభవంగా నిర్వహించారు. మాఘ శుద్ధ దశమి మంగళవారం పురస్కరించుకుని దేవస్థానం ఈవో బొక్కా వీర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో లక్ష చామంతి పూజ నిర్వహించారు. సుమారు 350 మంది ఈ పూజకి తమ పేర్లు నమోదు చేయించుకోగా సుమారు 200 మంది భక్తులు స్వయంగా పూజలో పాల్గొన్నారు.

పీఎంసీ కమిటీ చైర్మన్ ఈశ్వరరావు మృతి


దాకే ఈశ్వరరావు (ఫైల్)

మామిడికుదురు: ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల పీఎంసీ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత దాకే ఈశ్వరరావు (45) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేతగా గుర్తింపు పొందిన ఈశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కళిరెడ్డి ఆంజనేయులు, స్థానిక సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి తదితరులు పేర్కొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షికోత్సవం

పి.గన్నవరం: నరేంద్రపురం సెంటర్లో వేంచేసిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షిక మహోత్సవాలను మంగళవారం కోనసీమ విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శి ఆవుపాటి వేణు గోపాలరావు, నాయకులు ఊడిమూడి సుబ్బారావు, వీరశంకర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నరేంద్రపురం కమిటీ సభ్యులను ఆయన దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కోసూరి చిదంబరాచారి, బుల్లోజు శ్రీకాంత్, పట్నాల వెంకటరమణ, మల్లికార్జునరావు, ఓడూరి సాయికిరణ్, అనుపోజు భగవాన్, గణపతి, లక్కోజు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

3న వాహనాల వేలం

ఆలమూరు: ఎస్‌ఈబీ పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల మూడున వేలం వేయనున్నట్లు సీఐ కె.శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు వాహనాలకు వేలం వేయనున్నామని అన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన పాటదారులు వేలంలో పాల్గొనేందుకు ఆధార్‌కార్డుతో పాటు రూ.రెండు వేలు ధరావత్తు చెల్లించాలని అన్నారు. ఇతర వివరాలకు స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

అయోడిన్ లోపాన్ని నివారించాలి

ఆలమూరు: చిన్నారులు, విద్యార్థులు, గర్భిణులు, బాలింతల్లో తరచూ సంభవించే అయోడిన్ లోపాన్ని నివారించి మెరుగైన ఆరోగ్య రక్షణకు సహకరించాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. మండలంలోని పెనికేరు, కలవచర్ల గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు వనుం చిన్నావతి, వడ్డి వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అలాగే వివిధ గ్రామాల్లో కుష్ఠువ్యాధి నివారణ పక్షోత్సవాలు నిర్వహించి తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ, ఏఎన్ఎంలు టి.సుశీల, కె.రాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్స్‌పర్ట్ కమిటీలో ‘యెనుముల’కు స్థానం

మలికిపురం: ఓఎన్జీసీ, గెయిల్ నుంచి కోనసీమలో పర్యావరణ నష్ట నివారణ చర్యల కోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా ఎక్స్‌పర్ట్ కమిటీ వేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఓఎన్జీసీ, గెయిల్ నుంచి పర్యావరణ నష్ట నివారణ కోసం ఎన్‌జీటీలో కేసు వేసిన సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలేనికి చెందిన యెనుముల వెంకటపతిరాజును కూడా సభ్యుడిగా వేశారు. కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ ఉంటారు. సభ్యులుగా వెంకటపతిరాజుతో పాటు కాకినాడ జేఎన్‌టీయూ సివిల్ ఇంజినీర్, జిల్లా ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్, జాయింట్ కలెక్టర్ (అగ్రికల్చర్), రాజమహేంద్రవరం ఓఎన్జీసీ ఈహెచ్‌ఎస్ విభాగం, డ్రైన్స్, ఇరిగేషన్ ఈఈలు, డీపీఓ (పంచాయతీ రాజ్), రూరల్ వాటర్ సప్లయ్ ఎస్‌ఈ, శానిటేషన్, పంచాయతీ రాజ్ ఎస్‌ఈలను కూడా సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా యెనుముల వెంకటపతిరాజు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (చెన్నై)లో వేసిన కేసు అనంతరం కోనసీమలో పర్యావరణ నష్టనివారణ చర్యల కోసం ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు రూ.22 కోట్ల 76 లక్షల 62 వేల 500 చెల్లించాలని గత ఏడాది తీర్పు ఇచ్చింది.

పొలంబడి తనిఖీ చేసిన మధులేటి

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో పొలంబడి నిర్వహణ తీరును గుంటూరు వ్యవసాయ కమిషనరేట్ నుంచి వచ్చిన వ్యవసాయ సంచాలకుడు ఎ.మధులేటి తనిఖీ నిర్వహించారు. స్థానిక అధికారులు నిర్వహిస్తున్న పొలంబడి నిర్వహణను పరిశీలించిన ఆయన రైతులతో నేరుగా మాట్లాడారు. వరి నాట్లు, ఎరువుల యాజమాన్యం పద్ధతులను తెలుసుకున్నారు. రైతులతో నిర్వహణ పాటు విశ్లేషణ చార్టులను రూపొందించి రైతుల మాటలలో వివరాలను తెలుసుకున్నారు. రికార్డులను కూడా పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కాకి నాగేశ్వరరావు, డీఆర్‌సీ ఏడీఏ రాజశేఖర్, రాజోలు ఏడీఓ రామ్మోహనరావు, ఏఈ ఎస్.రాకేశ్, మండల వ్యవసాయ మండలి చైర్మన్ నల్లి శివకుమార్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ థెరిసా తదితరులు పాల్గొన్నారు.


విశ్వేశ్వరాయపురంలో పొలంబడి తనిఖీ చేస్తున్న కమిషనరేట్ ఏడీఏ మధులేటి, జిల్లా అధికారులు

ఎమ్మెల్యే పరామర్శ

కొత్తపేట: అస్వస్థతకు గురై కోలుకున్న రాష్ట్ర పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజును ఎమ్మెల్యే, చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. ఆదివారం సాయంత్రం డేవిడ్‌రాజు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న డేవిడ్‌రాజు తిరిగి కొత్తపేటలో స్వగృహానికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. కాగా మంగళవారం సాయంత్రం ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, డేవిడ్‌రాజు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జగ్గిరెడ్డితో పాటు ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎం.వెంకటేశ్వరరావు, నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి తదితరులు పరామర్శించారు.


కొత్తపేటలో డేవిడ్‌రాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

విక్రమ భట్టీశ్వరస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆలమూరు: ఆలమూరులో విక్రమ భట్టీశ్వరస్వామి కల్యాణం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో వేద పండితులు అంగర రంగాచార్యులు మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ పురోహితులు ఈ పూజా కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం జరిగింది. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

సంకరీకరణలో తల్లి చెట్టు ఎంపికే కీలకం

అంబాజీపేట: కొబ్బరి సంకరీకరణలో తల్లి చెట్టు ఎంపిక ఎంతో కీలకమని, అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంచుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డా.బి.శ్రీనివాసులు సూచించారు. కొబ్బరిలో సంకరీకరణపై జరుగుతున్న శిక్షణలో భాగంగా మంగళవారం శ్రీనివాసులు మాట్లాడుతూ తల్లి చెట్టును మంచి దిగుబడినిచ్చే రకాన్ని ఎంచుకోవాలని, తల్లి చెట్టు వయసు 20 నుంచి 40 ఏళ్లు ఉండాలన్నారు. రెండో రోజు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంటమాలజీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, పెథాలజీ శాస్త్రవేత్త వి.గోవర్ధనరావు, బి.నీరజ, వి.అనూష, రీసెర్చ్ అసోసియేట్ జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపిక చేసిన 20 మంది అభ్యర్థులకు క్షేత్ర స్థాయిలో సంకరీకరణ విధానంపై తీసుకోవాల్సిన చర్యలను ప్రయోగాత్మకంగా వివరించారు.

అంకితభావంతో వైద్య సేవలు అందించాలి

రావులపాలెం: ప్రజలకు వైద్యసేవలు అంకితభావంతో చేయాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలపురం పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, చిర్ల రామచంద్రారెడ్డి, సర్పంచ్ సబ్బితి మోహనరావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కొత్తపేట డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.సుమలత, డాక్టర్లు సాయిలేఖ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప దీక్ష వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అంబాజీపేట: సీపీఎస్ రద్దు కోసం ఏపీయూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే సంకల్ప దీక్ష వాల్‌పోస్టర్‌ను మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. మండల యూటీఎఫ్ అధ్యకుడు పి.ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 3న, కృష్ణా జిల్లా గన్నవరం సమీపాన సుందరయ్య విద్యానగర్‌లో ఉన్న ధర్మస్థలి ప్రాంతంలో సంకల్ప దీక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల యూటీఎఫ్ కార్యదర్శి జీవీ రమా, కోశాధికారి గుబ్బల రాంబాబు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకు ప్రతి ఉద్యోగి ఈ దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇకపై అన్నీ మంచి శకునాలే

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- క్రాప శంకరాయగూడెంలో గడప గడపకూ..

అయినవిల్లి: సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్ని మంచి శకునాలేనని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని క్రాప శంకరాయగూడెంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికీ తిరిగి గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిపక్షాలకు మింగుడుపడటం లేదన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో రహదారులు నిర్మించాలని, ఇంటి నిర్మాణం కోసం రుణాలివ్వాలని ఇలా పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే చిట్టిబాబు దృష్టికి తీసుకొచ్చారు. వాటిని అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా కామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, కుడుపూడి రామకృష్ణ, పాటి రవికుమార్, పరమట శ్రీనివాసరావు, మట్టపర్తి వెంకటరమణ, కుసుమ లిల్లీమంగేష్కర్, కోండ్రు శ్రీను, పెట్టా జగన్ తదితరులు ఉన్నారు.


క్రాప శంకరాయగూడెంలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ప్రజాబాంధవుడు సోమసుందరరెడ్డి

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మూడు దశాబ్దాలు కొత్తపేట నియోజకవర్గంతో పాటు జిల్లా రాజకీయాల్లో తన కంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకుని పదవులతో పనిలేకుండా నిరంతరం ప్రజా సేవలో ప్రజా బాంధవుడిగా చిర్ల సోమసుందరరెడ్డి నిలిచారని, ఆయన కుమారుడిగా ఆయన ఆశయ సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమసుందరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండలంలోని గోపాలపురం కాలువ పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజా సేవతో ప్రజల గుండెల్లో తన తండ్రి ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారన్నారు. భౌతికంగా ఆయన లేకపోయిన ఆయన అభివృద్ధి చేసిన కార్యక్రమాల రూపంలో నేటికీ ఆయన ప్రజల మధ్యనే ఉన్నారని, ఆయన అడుగుజాడల్లో తాను పయనించి ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.మోహనరావు, మాజీ ఉప సర్పంచ్ చిర్ల రామచంద్రారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యవర్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జాతీయ రహదారి పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న సోమసుందరరెడ్డి విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా స్థానిక నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కర్రి వీర్రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: పేద, సామాన్య కుటుంబాల్లో ఎందరో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా ఆ కుటుంబాలకు వెలుగు ప్రదాతగా మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గంటి సర్పంచ్ సాగి బంగార్రాజు అన్నారు. మంగళవారం సోమసుందరరెడ్డి వర్ధంతి పురస్కరించుకుని మండలంలోని గంటిలో సోమసుందరరెడ్డి విగ్రహానికి సర్పంచ్ బంగార్రాజు ఆధ్వర్యంలో నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముళ్ల జనార్దన్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మట్టపర్తి వెంకట్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు యడ్ల కృష్ణమూర్తి, భూపతిరాజు సత్యనారాయణరాజు, పార్టీ వివిధ విభాగాల సభ్యులు పంతగాని శామ్యూల్, నేరేడుమిల్లి నరేష్, వైవీ తదితరులు పాల్గొన్నారు. పలివెల వంతెన వద్ద మాజీ ఎమ్మెల్యే సోమసుందరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు గ్రామ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


గోపాలపురంలో చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి తదితరులు

భారీ ర్యాలీతో గజమాల ఊరేగింపు

మామిడికుదురు: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ మెడలో ఆవిష్కరించే గజమాల యాత్ర ఊరేగింపు మంగళవారం ఘనంగా జరిగింది. అల్లవరం మండలం ఓడలరేవు నుంచి పాశర్లపూడి వైనతేయ వారధి మీదుగా ఈ యాత్ర సాగింది. అగ్నికుల క్షత్రియ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రకు వివిధ ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. బాణసంచా కాల్పులతో బైక్ ర్యాలీతో ఈ యాత్ర పాశర్లపూడి, మామిడికుదురు, నగరం గ్రామాల్లోని 216వ నెంబర్ జాతీయ రహదారి మీదుగా సాగింది. కోనసీమలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన అగ్నికుల క్షత్రియ సంఘాల ప్రతినిధులు గజమాల యాత్రలో పాల్గొన్నారు.

కొపనాతి, పెమ్మాడి విగ్రహాలకు నివాళులు

పి.గన్నవరం: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ స్ఫూర్తితో అందరూ భక్తి మార్గంలో పయనించాలని పి.గన్నవరం నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు అన్నారు. స్థానిక అక్విడెక్టు పార్కులో కృష్ణమ్మ, మత్స్యకార సంఘ రాష్ట్ర నాయకుడు దివంగత పెమ్మాడి సుబ్బారాజు విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం కృష్ణమ్మ గజమాల యాత్రకు మోటారు సైకిళ్లపై నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమాల్లో సంఘ నాయకులు పెమ్మాడి మారుతీ కృష్ణమోహన్, కొల్లు రాంబాబు, అవనిగడ్డ సత్తిబాబు, అంకాని సత్తిబాబు, కొపనాతి సీతారామయ్య, శేరు త్రిమూర్తులు, శేరు దుర్గాప్రసాద్, కొపనాతి కృష్ణ, లంకే భీమరాజు తదితరులు పాల్గొన్నారు.


రాజోలులో కొనసాగుతున్న మహాగజమాల యాత్ర

రాజోలులో..

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ మహాగజమాల యాత్ర ఘనంగా కొనసాగింది. మంగళవారం మహాగజమాల యాత్రకు తాటిపాక సెంటర్‌లో రాజోలు తాలూకా అగ్నికులక్షత్రియులు ఘన స్వాగతం పలికారు. తాటిపాక, పొదలాడ, రాజోలులో కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కొపనాతి కృష్ణమ్మ వంశీయుడు కొపనాతి శ్రీనివాసవర్మ యాత్రలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహాగజమాల మహాయాత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చింతా మహానాగరాజు, చింతా రామకృష్ణ, కాటాడి ఉమామహేశ్వరరావు, మల్లాడి శ్రీనివాసరావు, యిల్లింగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా విజయకృష్ణ



కొత్తపేట: యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా టి.విజయకృష్ణ ఎన్నికయ్యారు. కొత్తపేట మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా పనిచేసిన విజయకృష్ణను మండపేటలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మండల నాయకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం విజయకృష్ణను పలువురు సంఘ నాయకులు అభినందించారు.

నేడు కాలభైరవస్వామి తీర్థం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం సుబ్బారాయుని దిమ్మ సెంటర్ ప్రాంతంలో కొలువైవున్న కాలభైరవస్వామి వారి తీర్థం బుధవారం జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఏడు గ్రామాల ఆధ్వర్యంలో ఏటా భీష్మ ఏకాదశి పర్వదినాన నిర్వహించే స్వామివారి తీర్థ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలివస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీగణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం 6.900 కేజీల వెండితో చేయించిన ఆభరణాలకు మంగళవారం సంప్రోక్షణ నిర్వహించి స్వామి వారికి అలంకరించారు.

వెండి ఆభరణాల అలంకరణలో కాలభైరవుడు →

